క్లుప్తంగా

తూకం యంత్రాల పరిశీలన



రెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 26 కొనుగోలు కేంద్రాల్లో లక్ష క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం, 25 వేల క్వింటాళ్ల సన్న ధాన్యం సేకరించినట్లు తెలిపారు. చేగుంట, పిట్ల తండా, రుక్మాపూర్ గ్రామాల కొనుగోలు కేంద్రాలను మూసేసినట్లు తెలిపారు. 26 వందల మంది రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల పరిశీలన



తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్: అక్రమంగా తవ్వకాలను అధికారులు సోమవారం పరిశీలించారు. మైనింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫైజల్ నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌లోని 134 సర్వే నంబరులోని భూమిలో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లు గుర్తించామని ఫైజల్ తెలిపారు. మట్టిని తవ్వేందుకు వినియోగించిన జేసీబీని సీజ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తవ్విన గుంతల కొలతలు తీసి అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు.

గరుడసేవ మహోత్సవం



గరుడ సేవ ఊరేగింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారికి పూజారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ మహోత్సవాలు నిర్వహించారు. అనంతరం గరుడసేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, మైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల అవగాహన కోసం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద రూ 5 లక్షలతో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం నాలుగు విడతలలో రూ 5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. నిబంధనల మేరకు 400 నుంచి 600 ఫీట్ల వైశాల్యంలో మాత్రమే ఇల్లు నిర్మించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బిల్లులు మంజూరు కావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్ పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా మహోత్సవాలు చేపట్టారు. బగలాముఖీ ఉపాసకులు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదానం చేశారు.

భక్తుల కోర్కెలు తీర్చే వీరభద్రుడు

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ముస్తాబైనా ఆలయం



జాతర పత్రికను అందిస్తున్న గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా నిలుస్తున్న వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలోని గుట్టపై భద్రకాళీ సమేత వీరభద్రుడు వెలిశాడు. ఎత్తయిన కొండ, పచ్చని చెట్లతో ఆలయ ప్రాంగణంలో ఆహ్లాదం ఉట్టి పడుతుంది. గుట్టపై నుంచి ఎటు చూసినా కొన్ని కిలో మీటర్ల మేర ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. గ్రామస్తులంతా కలిసి ప్రతి ఏటా నవాహ్నిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ముస్తాబైనా ఆలయం

వారం రోజుల పాటు జరిగే వీరభద్రుడి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దాతల సహకారంతో దేవాలయ ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ, షెడ్డుల నిర్మాణాలు, విశ్రాంతి భవనం, వంటగది, విద్యుద్దీపాలతో కొత్తకళను సంతరించుకున్నాయి. ఏడాదికోమారు జరిగే ఉత్సవాల్లో రోజు రోజుకు భక్తుల తాకిడి మరింతగా పెరుగుతోంది. కుస్తీ పోటీలు, బండ్ల ఊరేగింపుకు ట్రాక్టర్లతో చదును చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

మంత్రికి ఆహ్వానం

బొడ్మట్‌పల్లి గుట్టపై వెలిసిన వీరభద్రస్వామి ఉత్సవాలకు హాజరుకావాలని గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానం పత్రం అందజేశారు. జాతర గోడపత్రికను ఆవిష్కరించారు. 14న జరిగే వీరభద్రుడి కల్యాణోత్సవానికి హాజరుకానున్నట్లు మంత్రి తెలిపారు.

దర్శించుకున్న సినీ దర్శకుడు నితిన్

బొడ్మట్‌పల్లి భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం సినీ దర్శకుడు నితిన్ దర్శించుకున్నారు. వీరభద్రుడికి అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథం నిర్మాణానికి విరాళ మందించడంతో పాటు జనరేటర్ ఇప్పించినట్లుగా ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ తెలిపారు.



ముస్తాబైన ఆలయం

మూల మలుపు.. మృత్యువుకు పిలుపు

నాలుగు నెలల్లో నలుగురు మృతి



వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లింగం

చేగుంట(తూప్రాన్): మండలంలోని గజ్వేల్ రోడ్డు కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయానికి సమీపంలోని మూల మలుపు ప్రమాదాలకు కేంద్రంగా మారింది. ఒకే ప్రదేశంలో నాలుగు నెలల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కర్నాల్‌పల్లి మలుపు వద్ద ఫిబ్రవరి 14న విధులు ముగించుకొని వస్తున్న సీఆర్పీలు రమేశ్, శ్రీనివాస్‌లను ఆటో ఢీకొడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈనెల 7న బైకును లారీ వెనుక నుంచి ఢీకొట్టగా దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన తోడంగి లింగం (50), అలాగే.. ఆదివారం ఇదే ప్రదేశంలో బైకు అదుపుతప్పి రామాయంపేట మండలం దంతపల్లికి చెందిన ప్రవీణ్ మృత్యువాత పడ్డాడు. ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

సీఐ వెంకట్‌రాజాగౌడ్



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న సీఐ, ఎస్ఐ, సంతోష్

రామాయంపేట(మెదక్): మారుమూల గ్రామంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అదే గ్రామానికి చెందిన యువకుడు కామిని సంతోష్ సన్మానించారు. సోమవారం గ్రామంలో జరిగిన సమావేశంలో సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజ్, సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలని సూచించారు. ఉత్తీర్ణత సాధించిన గ్రామానికి చెందిన విజయ, భవానీ, నందకిశోర్, వంశీకృష్ణ, రాఘవేంద్రను సంతోష్ సన్మానించడం గొప్ప విషయమన్నారు. కాగా, సీఐ, ఎస్ఐలను కూడా ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించిన జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు రంజిత్, శ్యాంకుమార్, మహేశ్, భానుపాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీ అయిన పోలీసులను ఎస్ఐ రంజిత్ రెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐలు విఠల్ మెదక్ రూరల్, శ్రీనివాస్ మనోహరాబాద్, పీసీలు శ్రవణ్ టేక్మాల్, ఆంజనేయులు నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు. దీంతో వారిని ఎస్ఐ సన్మానించారు.

– కౌడిపల్లి(నర్సాపూర్):



బదిలీ అయిన పోలీసులను సన్మానించిన ఎస్ఐ

పూలదారి



క్రీడా ప్రాంగణాన్ని తవ్వేసిన దృశ్యం

హరితహారంలో భాగంగా గతంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు, ప్రస్తుతం పెద్దవై, ఎర్రని పూలతో కనువిందు చేస్తున్నాయి. చిట్కుల్ చౌరస్తా నుంచి చిలప్‌చెడ్, గౌతాపూర్, గుజిరి తండాకు వెళ్లే దారిలో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– చిలప్‌చెడ్(నర్సాపూర్):

16న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని ఎస్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి సంబంధించి మిగిలి వున్న సీట్ల కోసం 16న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ గంగారాం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గురుకులాలల్లో చదివిన విద్యార్థులతో అడ్మిషన్లు నిర్వహించగా.. కొన్ని సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

బీరప్ప కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం రామతీర్థంలో సోమవారం జరిగిన బీరప్ప,కామరతి దేవి కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, పద్మా రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మన్నన్, ఎంపీడీఓ దామోదర్, ఎంఈఓ పుష్పవేణి

చిన్నశంకరంపేట(మెదక్): వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్, ఎంపీడీఓ దామోదర్ కోరారు. సోమవారం చిన్నశంకరంపేటలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థుల కరాటే ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధికారులు అభినందించారు. ఎంఈఓ పుష్పవేణి మాట్లాడుతూ.. విద్యార్థులకు యోగా, కరాటే, కంప్యూటర్ శిక్షణ, పెయింటింగ్, అల్లికలు, ఆర్ట్ అండ్ డ్రయింగ్‌లో ప్రతి రోజు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): యోగతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు సురేందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం విద్యార్థులకు యోగా ఆసనాలు నేర్పించారు. విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించడం పట్ల భవాని ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. నిర్వాహకులు ఆంజనేయులు, నరేందర్, సుదర్శన్, రాఘవు లు, హారిక, భార్గవి, జోష్న, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



మాట్లాడుతున్న లీలావతి



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లీలావతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, నోటు పుస్తకాలు, కంప్యూటర్ విద్య నేర్పడంతో పాటు మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దిరాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు సూర్యప్రకాశ్, యాదగిరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

శివ్వంపేట(నర్సాపూర్): తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులను ఎంఈఓ బుచ్చానాయక్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఉత్తమ బోధన అందివ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇందుమతి పాల్గొన్నారు.

రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని రంగంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం కోరారు. సోమవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత సౌకర్యాలపై గ్రామంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని నిర్ణయించారు., ఈ సమావేశంలో సభ్యులు శేఖర్, అనిల్, పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ వీలైనంత త్వరగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.



కొనుగోలు కేంద్రం సందర్శించిన మైసయ్య యాదవ్

నా కొద్దు ఇందిరమ్మ ఇల్లు

రద్దు చేయాలని ఓ మహిళ వినతి



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న పోచమ్మ

శివ్వంపేట(నర్సాపూర్): ఇందిరమ్మ ఇల్లు నాకొద్దు, మంజూరైన ఇంటిని వెంటనే రద్దు చేయాలని ఓ మహిళ విజ్ఞప్తి చేసింది. మండల పరిధి గంగాయిపల్లికి చెందిన చిన్నదాసరి పోచమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అయితే.. 60 గజాల్లో ప్రభుత్వం విధించిన షరతులతో కూడిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టలేమని పోచమ్మ చెబుతోంది. దీంతో తనకు మంజూరైన ఇంటిని రద్దు చేయాలని పంచాయతీ కార్యదర్శి సమ్యూల్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్ అన్నారు. మండలంలోని శెట్టిపల్లి కలాన్ గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, శంకర్, నారాయణరెడ్డి, నగేష్, నర్సింలు, పరశురామ్, రాజు, రాజగౌడ్, బాలేశం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న మల్లేశ్‌గౌడ్, తదితరులు

మానవ హక్కుల మండల అధ్యక్షుడిగా రాజేష్‌గౌడ్



నియామక పత్రాలు అందుకుంటున్న మండల కమిటీ సభ్యులు

నర్సాపూర్ రూరల్: జాతీయ మానవ హక్కుల కమిటీ నర్సాపూర్ మండల అధ్యక్షుడి రాజేష్‌గౌడ్ ఎన్నికయ్యాడు. మండల ఉపాధ్యక్షుడిగా సతీష్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బోయిని రాజులతోపాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

మల్లికార్జున స్వామికి బండ్ల ఊరేగింపు

అల్లాదుర్గం(మెదక్): గడిపెద్దాపూర్ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామికి ఎండ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు బిజిలిపూర్, పోతులబోగుడ, చేవెళ్ల, ముస్లాపూర్, చుట్టు పక్క గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.



గడిపెద్దాపూర్ మల్లికార్జున స్వామికి బండ్ల ఊరేగింపు

సంక్షిప్త వార్తలు

◆ **యువవికాసం దరఖాస్తులు అందజేయాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): రాజీవ్ యువవికాసం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రెండు రోజులలో దరఖాస్తు ఫారాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లా తెలిపారు. రాజీవ్ యువవికాసం కోసం 1883మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కాగా ఇప్పటివరకు 1594 మంది దరఖాస్తు పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందచేయగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖ అధికారులు దరఖాస్తు ఫారాలను పరిశీలించారని చెప్పారు. ఇంకా 289 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పటికి దరఖాస్తు ఫారాలను అందజేయలేదని, రెండు రోజులలో ఎంపీడీఓ కార్యాలయం హెల్ప్‌డెస్క్‌లో ఇవ్వాలని కోరారు.

◆ **రోడ్డుపై పారుతున్న మురికినీరు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో కాలనీలో దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామ పంచాయతీ సమీపంలో అండర్ గ్రౌండ్ మురికి కాలువలో చెత్త పేరుకుపోవడంతో మురికి నీరు సీసీ రోడ్డుపై వరదలా ప్రవహిస్తుంది. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. నల్లపోచమ్మదేవి ఆలయానికి వెళ్లే వారితో పాటు గ్రామస్తులకు ప్రధాన రహదారి కావడంతో కాలనీవాసులతోపాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

◆ **18 నుంచి మాణిక్‌ప్రభు జాతర ఉత్సవాలు**

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో శ్రీ మాణిక్ ప్రభు 33వ వార్షికోత్సవ జాతర ఉత్సవాలను ఈ నెల 18 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 18న ఆదివారం స్వామి వారికి అభిషేకాలు, బోనాలు, 19న బండ్ల ఊరేగింపు, రాత్రి రేణుకా ఎల్లమ్మ నాటకం, 20న కుస్తీ పోటీలు, అన్నదానం, 21న మాణిక్ ప్రభు పల్లకి సేవ, 22న పాచి బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

◆ **విద్యుత్ స్తంభాలను సరి చేయండి**

నర్సాపూర్ రూరల్: ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షానికి వంగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని మాడాపూర్ రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. వారం క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి వ్యవసాయ బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా అయ్యే స్తంభాలు చాలా చోట్ల ఒక వైపునకు వంగడంతో తీగలు నేలకు తాకుతున్నాయి. దీంతో మనుషులతో పాటు మూగజీవాలకు ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు.

◆ **నాలుగోసారి తైబజార్ వేలం పాట వాయిదా**

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీకి సంబంధించి తైబజార్ వేలం పాట వరుసగా నాలుగోసారి వాయిదా పడింది. తాజాగా సోమవారం జరిగిన వేలంపాటలో ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ గత ఏడాది రూ. 20 లక్షలకు వేలం పాట పాడిన స్థానిక యువకులు కొందరు సక్రమంగా వసూలు కాకపోవడంతో నష్టపోయారు. దీనితో ఈసారి ఎవరూ కూడా ముందుకు రావడం లేదు. మున్సిపల్ నిబంధనల మేరకు గత ఏడాది కంటే ఎక్కువ వేలం పాట పాడిన వారికే కేటాయించాలి. ఎవరూ రాకపోవడంతో వాయిదా పడింది.

◆ **ఇందిరమ్మ బిల్లుల మంజూరు**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు మంజూరైనట్లు ఎంపీడీఓ దామోదర్ తెలిపారు. ఈనెల 2న సాక్షిలో ‘రాని బిల్లులు...ఆగిన నిర్మాణాలు’ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు స్పందించి టెక్నికల్ సమస్యను పరిష్కరించారు. దీంతో సోమవారం మిర్జాపల్లితండాకు చెందిన ఏడుగురు లబ్ధిదారుల ఖాతాలలో బేస్మెట్ బిల్లు రూ. లక్ష చొప్పున జమ అయినట్లు తెలిపారు.

◆ **పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం**

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామంలో సోమవారం పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి కార్యకర్తలతో కలసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పద్మను కూడా సన్మానించారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్ పాల్గొన్నారు.